


## నెలనెలా నవ్వుల పండగ

### కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకటకృష్ణమూర్తి

న్యూస్ రీడర్ లంబోదరం కొడుకు కళ్ళు మూసుకుని దేముడ్ని ప్రార్థించసాగాడు.

"స్వామీ ! దేవా! నేను ఫిఫ్త్ క్లాస్ పరీక్ష - పాసయ్యేలా చూడు. ఆరోగ్యం - మా బామ్మకి దగ్గు తగ్గించు. ఫైనాన్స్ - మా నాన్న స్కూటర్ అమ్మేసి కారు కొనేలా అనుగ్రహించు. పెళ్ళి - మా అక్కయ్యలిద్దరికీ త్వరగా పెళ్ళయేలా చూడు.. ప్రార్థన ముగించే ముందు హెడ్ లైన్స్.. పరీక్ష, ఆరోగ్యం, ఫైనాన్స్, పెళ్ళి !!"

❀❀

## చౌచౌ... ఏరుకొచ్చిన నవ్వులు

"మనిషి రోజుకు సగటున పదివేల మాటలకన్నా ఎక్కువ మాట్లాడడని మొన్న ఎప్పుడో ఎక్కడో చదివానండీ"

"నిజమేనే! కానీ, నిన్ను చూస్తే మాత్రం నాకలా అనిపించటం లేదు."

డాక్టరు: జ్వరంగా వుందా బుజ్జిబాబూ! ఏదీ నాలిక చాపు

బుజ్జిబాబు: ఊహూ! నాలిక చాపితే మా నాన్నలా స్టాంపులు అంటించుకుందామనా! నేను చాపను.

తండ్రి కూతుర్ని పిలిచి "వినోద్ చాలా మంచివాడమ్మా! నిన్ను నిజంగా చాలా ప్రేమిస్తున్నాడు. అతన్ని చేసుకుంటే సుఖపడతావు" అన్నాడు.

"అంత ఖచ్చితంగా మీకెలా తెలుసు నాన్నా?" అన్నది చిన్నారి.

"నేను దాదాపు ఆర్నెల్లుగా అతని దగ్గర ఒకటికి పదిసార్లు అప్పులు తీసుకుంటున్నానా?! అయినా నిన్ను చూడ్డానికి ఇంకా మనింటి కొస్తున్నాడంటే నీ మీద ఎంత ప్రేమ ఉందో ఆలోచించు" అన్నాడు తండ్రి.

భర్త: భగవంతుణ్ణి నాకెప్పుడు చావు ప్రసాదిస్తావు తండ్రీ అని కోరుకుంటున్నాను.

భార్య: నేనూ అంతే! నా భర్తతోనే నన్నూ..

భర్త: అయితే నాకా చావక్ఖర్లేదు.

" ఒక అడుక్కునే వాడు రోజూ రోడ్డుమీద దొరికే సిగరెట్ పీకలను ఏరుకొనేవాడు. అలాంటి పది పీకలను కలిపి ఒక సిగరెట్ తయారు చేసుకుని కాల్చేవాడు. ఓ రోజు అతను వంద సిగరెట్ పీకలను ప్రోగుచేశాడు. ఆ రోజు అతనెన్ని సిగరెట్లు తాగినట్లు?"

"పదకొండు"

అద్దె ఇల్లు కోసం కాళ్ళకు బలపం కట్టుకు తిరిగి విసుగేసి బ్రోకరును సంప్రదించాడు ఓ పెద్దమనిషి.

"చుట్టుపక్కల ఐదు మైళ్ళదూరం వరకూ ఏ ఇల్లూ లేకుండా ఏకాంతంగా వుండే చిన్న ఇల్లు కావాలి"

"అలాగే! మీకు ప్రశాంతంగా, నిరాడంబరంగా జీవించడమంటే ఇష్టమల్లే ఉందే"

"అదేం కాదులే నేను సంగీత సాధన చేస్తున్నానులే" అన్నాడు పెద్దమనిషి.

టీచర్: నీరు ఐస్‌గా మారినప్పుడు గుర్తించదగ్గ ముఖ్యమైన మార్పు ఏమిట్రా శ్రీను.

శ్రీను: ధరలో మార్పు టీచర్ .

"ఏమిటోయ్ వెంకట్రావ్ ఈ మధ్య వైద్యం కోసం మద్రాసు వెళ్ళొచ్చావుట. ఎలా ఉందేమిటి? మతిమరుపేమన్నా తగ్గిందా?" పరామర్శించాడు ప్రసాదు.

"నా జ్ఞాపకశక్తికేమోయ్ అద్భుతంగా ఉంటోందీ మధ్య. ఓ మూడు విషయాలు తప్పించీ" అన్నాడు వెంకట్రావ్.

"ఏమిటా మూడు విషయాలు"

"అదే ఎవరి మొహాలూ గుర్తుండడంలేదు. పేర్లు సరేసరి ఊహకి కూడా అందడం లేదు. ఇకపోతే మూడోది.. మూడోది.. ఆ మర్చిపోయానోయ్. అంతే అంతకుమించి నా జ్ఞాపకశక్తికేం డోకా లేదు."

దమయంతికి కుక్కపిల్లల్ని పెంచండం మహా సరదా. అందుకని ఓసారి ఎగ్జిబిషన్లో ఓ కుక్క పిల్లని కొని పెంచడం మొదలుపెట్టింది. దాని ఆరోగ్యం ఏమాత్రం అటూ ఇటూ అయినా కంగారు పడిపోయేది.

ఓ రోజు ఆ కుక్కపిల్ల మూతిమీద ఏదో పురుగు కుట్టి మూతంతా బంతిలా వాచిపోయింది. వెంటనే పశువుల డాక్టరుకి ఫోన్ చేసి సంగతి చెప్పింది.

"దాంట్లో కంగారు పడవల్సిందేమీ లేదు. గోరువెచ్చని నీళ్ళతో కాపడం పెట్టండి. అదేపోతుంద"న్నాడాయన తాపీగా.

కానీ దమయంతికి ఆయన మాటలు తృప్తిని ఇవ్వలేకపోయాయి. "నొప్పికి ఆస్ప్రిన్ మాత్ర ఇస్తే మంచిదంటారా! ఒకటివ్వనా రెండివ్వనా? " అని వైద్యంలో తన తెలివిని ప్రదర్శించింది.

ఏదో సమాధానం చెప్పందే లాభంలేదని గ్రహించి డాక్టరు “చూడమ్మా! ఒక మాత్ర కుక్కపిల్లకిచ్చి రెండు మాత్రలు నువ్వు వేసుకో “ అని ఫోన్ పెట్టేశాడు.

ఓ పత్రికా విలేఖరి సైనిక శిబిరానికి వెళ్ళాడు. అతను సైనికులతో మాట్లాడుతూండగా ఓ మిలటరీ వేగన్ వచ్చింది. అందరూ హడావుడిగా లేచి వరసనే ఓ లైనుగా నిల్చున్నారు. వేగన్ ఈ చివర్నుంచి ఆ చివరి వరకూ నెమ్మదిగా సైనికుల ముందు నుంచి వెళ్ళింది వేగన్‌లో ఉన్న వ్యక్తి తొందర తొందరగా సైనికుల్ని చుస్తూ ఓ చిన్న నోటు పుస్తకంలో ఏదో రాసుకున్నాడు. వేగన్ వెళ్ళిపోయింది. జర్నలిస్టు కిదేం అర్ధం కాలేదు. కేప్టన్ దగ్గరకు వెళ్ళి "ఆ బండిలో వచ్చిందెవరండీ?" అనడిగాడు.

"అతను ఆర్మీ టైలర్" అన్నాడు కెప్టన్.

"టైలరా! అయితే సైనికులందరూ నిల్చోవడం, అతను బండిలో వాళ్ళముందు తిరగడం ఎందుకు?" అన్నాడు అయోమయంగా. "అదా! సైనికుల బట్టల కొలతలు రాసుకున్నాడంతే" అన్నాడు బదులుగా చాలీచాలని తన చొక్కాని ఎగాదిగా చూసుకుంటూ.

"ఇంతకీ మీ ఇంట్లో వాళ్ళతో నేనివాళ సాయంత్రం మీ ఇంటికి భోజనానికి వస్తున్నట్టూ, నా కవిత్వం వినిపించబోతున్నట్టూ చెప్పావా?"

"ఆ! అలా చెప్పినందుకే మా వాళ్ళు జ్వరాలంటూ మూకుమ్మడిగా పడకవేశారు. డిన్నర్ కాన్సిలయింది"

ఒకాయన 'ఎంక్వైరీ ' కౌంటర్ ముందుకు దూకుడుగా పోయి, "ఏదండీ కంప్లైంట్ బుక్?" అడిగాడు కోపంగా.

"ఉండవయ్యా! రెండు గంటల నుంచీ అందరం దానికోసమే వెతుకుతున్నాం" అన్నారు వారందరూ విసుక్కుంటూ.

"అయితే నేను నిన్ను ప్రేమించటం లేదంటే నిజంగా చచ్చిపోతావా రాజూ!?"

"ఇంకా సందేహమేనా! అది నా పద్దతే. గతంలో శారద, గీత, శాంతల విషయంలో కూడా ఈ మాటే చెప్పాను."

గుంటలూ, గతుకులూ ఉన్న రోడ్డును ప్రత్యక్షంగా చూస్తున్న మేయర్ రోడ్ల శాఖా ఉద్యోగిని "ఇదేం? ఇలా వుందీ రోడ్డు?" అనడిగాడు.

"బాగుచేయకుండా అలాగే ఉంచితే స్పీడ్ బ్రేకర్సుగా పని కొస్తాయని అలా ఉంచేసాన్సార్. పైగా డబ్బు ఆదా కూడా కదా" అన్నాడు ఇంజనీరు.

COMMENTS